# ఉత్తరాల కథ

-గజ్జెల కనకరాజు

సాధారణంగా సెలవు రోజుల్లో స్నేహితులెవరైనా మనల్ని చూడ్డానికి వస్తారు. అలాంటి వాళ్ళలో కొందరు తమ వస్తువులు అక్కడే మరిచిపోతుంటారు. తీరా ఇల్లు చేరాక అవి కనబడక నానాకంగారుపడి మనకి ఉత్తరాలు వ్రాయడం మొదలెడతారు. అవి తిరిగి పంపమని.

ఇలాంటి పనులంటే నాకు మహాచిరాకు. వాళ్ళు పారేసుకున్న చెత్తనంతా పోగుచేసి మూటకట్టి పోస్టాఫీసులో పడేయడం కన్నా, ఓపికతో ఓ తెలుగు సినిమా పూర్తిగా చూడడమే నయమనిపిస్తుంది ఒక్కోసారి.



అలాంటివాళ్ళ తిక్క కుదర్చడానికి నేనో మందు కనిపెట్టాను. అదేమిటంటే వాళ్ళు వ్రాసిన ఉత్తరాలకు సరిగా సమాధానాలు వ్రాయకుండా, పారేసుకున్న వస్తువుల గురించి డొంక తిరుగుడు ప్రశ్నలు వేయడం, అలాగే తలాతోక తేల్చ కుండా విషయాన్ని సాన్చుకుంటూ పోవడం.

ఒకసారి ఇలా చేస్తేగాని వాళ్ళకు పూర్తిగా బుద్ధిరాదు. జన్మలో ఇహ అలాంటి పనులు చేయరు.

ఉదాహరణకి ఒక చిన్న సంఘటన చెప్తాను. గత సంక్రాంతి సెలవులకు నాగేంద్ర సతీసమేతంగా విచ్చేసి మదర్పిత కాఫీ, భోజనాధులు బాగా సేవించి ఓ వారం తర్వాత మమ్మల్ని వదిలి పోయారు. పీడవదిలిందని అను కుంటూండగానే వాడి దగ్గర నుండి ఒక ఉత్తరం వచ్చింది. వెళ్ళేటప్పుడు మా ఇంట్లో ఓ జత బూట్లు వదలిపోయాడట. ఒళ్ళు మండింది. ఉత్తరం రాశాను.

జనవరి 21

నాగేంద్రా!

నీ ఉత్తరం అందింది. నీ బూట్లనే మర్చిపోయి వెళ్ళడం విచిత్రంగా ఉంది. అయినా బూట్లు లేకుండానే వట్టి కాళ్ళతో వెళ్ళావేమిటి?నేను అంతగా గమనించలేదు అనుకో! వివరాలు తెలియజెయ్! అలాగే పంపుతాను.

-రాజు

ఓవారం రోజుల్లోనే జవాబు వచ్చింది.

"ఉత్తికాళ్ళతో వెళ్ళలేదు. వస్తూ వస్తూ ఇంకొక జత కూడా తెచ్చుకున్నాను: అవి వేసుకొచ్చాను. కాబట్టి దిగవిడిచినవి పంపు" అని సారాంశం.

మళ్ళీ జాబు వ్రాశాను.

జనవరి 29.

నాగేంద్రా!

జాబు అందింది. నేనైతే నీకు బూట్లు పంపడానికి సిద్ధంగానే ఉన్నాను. కాని అవి ఏ జతవో తెలియకపోతే

ఎలా? నీవు కాళ్ళకు వేసుకొని వెళ్ళినవా, లేకపోతే వెంట తెచ్చుకున్న జతవా? తెలుపగోరుతాను.

-రాజు

నాగేంద్ర మండిపడుతూ ఉత్తరం రాశాడు. 'ఏ బూట్లయితేనేమి ఇంట్లో అఘోరించినవాటిని పంపు' అని.

నిజానికి నాకుతెలీక కాదు. ఇంట్లో నావి కానివి వాడి జతే అయి ఉండాలి.

కాని వాడిని ఏడ్పించాలి.

మళ్ళీ ఉత్తరం.

ఫిబ్రవరి 8

నాగేంద్రా!

అలా కోప్పడితే ఎలా చెప్పు? నీవు వదిలి వెళ్ళింది ఏ రంగు బూట్లో తెలుసుకోడానికే అలా వ్రాశాను. ఏ రంగో తెలియకపోతే ఎలా పంపను చెప్పు? నీవేమో వివరాలు తెలుపలేదు. వెంటనే వ్రాస్తావు కదూ? ఇంట్లో అంతా కులసా అనుకుంటాను. చెల్లాయిని, పిల్లల్ని అడిగినట్లు చెప్పడం మరచిపోకు.

- రాజు

ఈసారి వచ్చిన ఉత్తరం మాత్రం నన్ను కొంచెం ఆశ్చర్యంలో ముంచింది. చకితుణ్ణి చేసింది. దానిలో ఓ సంబోధన, సారాంశం, సంతకం ఏమీ లేవు. ఒకే ఒక పదం ఉంది. "నలుపు" అని.

ఈసారి ఉత్తరం వ్రాయడం కొంచెం ఆలస్యమైంది. కారణం కొన్నాళ్ళు జబ్బు చేసి బాధపడ్డాను.

ఫిబ్రవరి 28

నాగేంద్రా!

జవాబు ఇవ్వడం ఆలస్యమైనందుకు క్షమించు. ఈ మధ్య జబ్బుపడి లేచాను. ఇహ బూట్ల సంగతి అవి ఎరుపో - నలుపో అయి ఉండాలి అనుకున్నాను. తెలుసుకుంటే మంచిదని వ్రాశాను.

కాని ఇంకో చిన్న చిక్కు వచ్చిపడింది. ఇంతకూ వాటిని ఎక్కడవదిలేశావో వ్రాయలేదు. ఆ విషయం కొంచెం తెలిపితే ఆలస్యం కాకుండా పంపుతాను.

- రాజు

రెండు రోజులు గడిచిన వెంటనే ఆటంబాంబు లాంటి ఉత్తరం వచ్చింది. చదవండి...

మార్చి 2

'ఒరేయ్ వెధవాయ్!

నీ బుర్రలో దేవుడు ఏం పదార్థం పెట్టాడోగాని దాన్ని తీసికెళ్ళి లండన్ మ్యూజియంలో పెట్టొచ్చు. నీ బుర్రలో మట్టి పెట్టినా అది కొంచెం పనిచేసేదేమో! అందులో ఏమీలేనట్లుంది. బూట్లు ఇంకెక్కడుంటాయి? డ్రెస్సింగ్ రూమ్‌లో వెతికి త్వరగా పంపేడువ్.

-నాగేంద్ర

ఉత్తరం చదివాక నవ్వొచ్చింది. నేను కావాలనే ఆలస్యం చేస్తున్నానని గ్రహించిన వాడి బుర్రను మ్యూజియంలో పెట్టాలో!

నా బుర్రను పెట్టాలో మీరే చెప్పండి! ఉత్తరం వ్రాశాను. కావాలనే కొంచెం ఆలస్యం చేశాను.

మార్చి 24

నాగేంద్రా!

నూతన సంవత్సర శుభాకాంక్షలు. మరొక శుభవార్త. నీ బూట్లు దొరికాయి. సైజు పదిన్నర. అబ్బా నీ సైజును చూసిన తర్వాత బూట్లను చూసి ఆశ్చర్యపడలేదనుకో. వెంటనే పంపిద్దామనుకున్నాను.

కాని ఒక చిక్కొచ్చిపడింది. నీవు వ్రాసిన పాత ఉత్తరాలు ఎక్కడో పోయాయి. బూట్లను పోస్టుద్వారా పంపమన్నావో, రైల్లో పంపమన్నావో మరచిపోయాను.

-రాజు

పాపం నిప్రాణ పుట్టుకొచ్చింది కాబోలు. ఈ ఉత్తరం ఏడుస్తూ వ్రాశాడు.

ఏప్రిల్ 4

'ఒరేయ్‌రాజూ!

నీకు నేనేం ద్రోహం చేశాను చెప్పు. ఇలా ఏడ్పిస్తావు. ఎలాగో ఒకలాగ వాటిని తగలెయ్యి. నీ దయ.

-నాగేంద్ర

ఏప్రిల్ 12

'నాగేంద్రా!

క్షమించాలి. నీ పట్ల ఏ దురుద్దేశమూ లేదు. ఒక విషయం. శ్రీరామనవమికి నువ్వు మీ ఊళ్ళో, ఉంటావో, అత్తగారి ఊరు వెళతావో తెలియదు. ఒకవేళ వెళ్ళేట్లయితే వెంటనే వ్రాయి. అక్కడికే పంపిస్తాను.

-రాజు

ఈసారి ఉత్తరం కోసంఎదురు చూస్తోన్న నాకు టెలిగ్రామే ఎదురైంది.

"పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే మక్కెలిరగదంతా!" అని.

ఇంకో రెండు రోజులుంటే వాడే దిగబడతాడని వెంటనే బూట్లని పోస్టులో పంపాను.

సరికొత్తబూట్లు, పాపం ఇంకా మోజు తీరలేదేమో.

ఇంతకీ నా ఉద్దేశ్యమేమిటంటే ఇలా ఇతరుల ఇళ్ళలో వస్తువులు పారేసుకునే వాళ్ళని దురలవాట్ల నుండి తప్పించాలని ఒకసారి ఇలా చేస్తే ఇక ముందెప్పుడూ అలాంటి పనులు కలలోనైనా చేయరు! అది అందరికి హాయి కదా!... ఏమంటారు?


గజ్జెల కనకరాజు
ఆదిత్య విద్యాలయం,
సిద్దిపేట - 502 103.





ఓ పోలీసాఫీసర్ టైలర్‌కి తన బట్టలు కుట్టడానికిచ్చాడు. కుట్టాక తొడుక్కుని చూసుకుని "ఇదేమిటి? ప్యాంట్‌కీ, షర్ట్‌కీ జేబులు పెట్టలేదా?" అడిగాడు.

"నేనింతదాకా తమ జేబుల్లోంచి డబ్బులు తీసి ఖర్చు పెట్టే పోలీసులని చూడలేదు కాబట్టి..." అన్నాడు టైలర్.


-పి.వి.మురళీ కృష్ణ
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500 036.





వి. బావాజి, కార్టూనిస్ట్, కురబలకోట-517350, జిల్లా:చిత్తూరు.